సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం : 10 : ఫిబ్రవరి : 2025



..పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, దుమ్ముగూడెంలలో ఆదివారం ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. 9లో



'క్యాథ్‌ల్యాబ్'కు బాలారిష్టాలు

సుమారు రెండున్నరేళ్ల క్రితం ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ సేవలు ప్రారంభించగా, ఇంకా బాలారిష్టాలు దాటలేదు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం

36° / 18°

వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నిత్యకల్యాణంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన తుమ్మల



వ్యవసాయ క్షేత్రంలో పంటలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

దమ్మపేట: సొంత వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న పలు రకాల కూరగాయల పంటలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఆదివారం మండల పరిధిలోని మల్లారం గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ క్షేత్రాన్ని వేకువజామున మంత్రి తుమ్మల సందర్శించారు. సాగు చేస్తున్న క్యాబేజీ, క్యాప్సికం, కాలీఫ్లవర్, వంకాయ, బీన్స్ వంటి కూరగాయల పంటలను పరిశీలించారు. సాగుకు అవసరమైన మెళకువలు, జాగ్రత్తలను కాపలాదారులకు తెలియజేశారు. మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, కేవీ, కొయ్యల అచ్యుతరావు తదితరులు ఉన్నారు.


నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో గిరిజనులు తమ సమస్యలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని సూచించారు.

ముగిసిన క్రీడా పోటీలు



బ్యాడ్మింటన్ కోర్టులో క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని హనుమాన్‌బస్తీ ఇండోర్‌లో స్టేడియంలో జరుగుతున్న బాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ కోచ్ గుజ్జుల సుధాకర్ రెడ్డి మెమోరియల్ క్రీడా పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ యుగంధర్‌రెడ్డి, సెక్రటరీ ఆర్.రాజేందర్, జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పి.పరంధామరెడ్డి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇంటూరి రవికుమార్, సెక్రటరీ కె.సావిత్రి, ట్రెజరర్ కె.రమేష్, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, గిరి పాల్గొన్నారు.

'సొసైటీ'లపై సందిగ్ధం!

- సహకార ఎన్నికలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఈ నెల 15తో ముగియనున్న పాలకవర్గాల గడువు
- పదవీకాలం పొడిగింపా? ప్రత్యేకాధికారుల పాలనా?



కొత్తగూడెం పీఏసీఎస్ కార్యాలయం

చుంచుపల్లి: రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తూ అండగా నిలుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల గడువు ఈ నెల 15తో ముగియనుంది. దీంతో పాలకవర్గాల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగిస్తారా? ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి తెస్తారా అనేది ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. జిల్లాలో 21 సొసైటీలు ఉన్నాయి. వీటికి 2020 జనవరి 15 ఎన్నికలు నిర్వహించారు. సహకార ఎన్నికలు నిర్ణీత సమయంలో జరపాలంటే గడువుకు కనీసం 45 రోజుల ముందే ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అలాంటి చర్యలు ఏమీ తీసుకోకపోవడంతో ఎన్నికలు జరిగే అవకాశం లేదని తేలిపోయింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మెజారిటీ పీఏసీఎస్ చైర్మన్లు ఆ పార్టీ నుంచే గెలుపొందగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎక్కువ మంది పార్టీ మారారు. వారంతా పదవీకాలం కొంతకాలం పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, జిల్లా, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సొసైటీలకు కూడా స్పెషలాఫీసర్లను నియమించే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మొదట స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే యోచనలో ఉంది. ఈ తరుణంలో పీఏసీఎస్‌లకు ఎన్నికలు ఇప్పట్లో జరగవనే చర్చ జరుగుతోంది.

ఇంకా ఉమ్మడి జిల్లా కేంద్రంగానే సహకార బ్యాంక్..

జిల్లాలో మరో 35 సొసైటీలు ఏర్పాటు చేయాలని అధికారులు ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని ఏర్పాటు చేశాక, సిబ్బందిని నియమించి జూన్‌లో ఎన్నికలు నిర్వహించవచ్చనే ప్రచారం కూడా జరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలోనే సహకార కేంద్ర బ్యాంకు పని చేస్తోంది. నూతన జిల్లాలు ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతున్నా జిల్లాస్థాయిలో సహకార బ్యాంకులు ఏర్పాటు చేయలేదు. ఇక 2014లో కొలువు దీరిన పాలకవర్గాల గడువు 2018తో పూర్తికాగా, అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదవీకాలం రెండేళ్లు పొడిగించింది. చివరకు 2020 ఫిబ్రవరి 15న ఎన్నికలు నిర్వహించింది. వీటి పదవీకాలం ఐదు రోజుల్లో ముగియనుండగా పాలక వర్గాలను పొడిగిస్తారా.. ప్రత్యేక అధికారులను నియమిస్తారా అనే దానిపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. అయితే పలువురు పీఏసీఎస్ చైర్మన్లు మాత్రం తమ విజ్ఞప్తితో ప్రభుత్వం పదవీ కాలం పొడిగిస్తుందనే భావనలో ఉన్నారు.

పొడిగిస్తే మంచిది



సహకార సంఘాల పదవీకాలం ఐదు రోజుల్లో ముగియనుంది. ఈ తరుణంలో ప్రస్తుత పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తే మంచిది. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను మరింతగా అందించేందుకు కృషి చేస్తాం.

– మండే వీరహనుమంతరావు, కొత్తగూడెం సొసైటీ చైర్మన్

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం..



సహకార సంఘాల పాలకవర్గాల గడువు ఈ నెల15తో ముగియనుంది. వీరి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తారా.. అదే కమిటీలను పొడిగిస్తారా అనేది ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. కొత్త సొసైటీల ఏర్పాటుపై కూడా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు.

–సయ్యద్ ఖుర్షీద్, జిల్లా సహకార అధికారి

నేటి నుంచి జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఆధ్వర్యంలో భారత అణుశక్తి విభాగం 39వ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో భాగంగా జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో సోమవారం నుంచి నిర్వహించనున్నారు. పోటీలను అణుశక్తి రెగ్యులేటరీ బోర్డు చైర్మన్ దినేష్ కుమార్ శుక్లా, భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సత్యకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారు. ప్రతి ఏడాది అణుశక్తి విభాగంలోని యూనిట్లలో ఒక్కో యూనిట్ పరిధిలో ఒక్కో క్రీడ నిర్వహించేలా ముంబైలోని అణుశక్తి విభాగ స్పోర్ట్స్ అండ్ కల్చర్ కౌన్సిల్ నిర్ణయిస్తుంది. ఈ ఏడాది మణుగూరు భారజల కర్మాగారానికి బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణ బాధ్యతను అప్పగించారు. ఈ పోటీల్లో అణుశక్తి విభాగంలోని ఎనిమిది జట్లు అజంతా, ఎల్లోరా, పుష్కర్, నాగార్జున, గోల్కొండ, కోణార్క్, ద్వారకా, రామేశ్వరం జట్లు పాల్గొననున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది క్రీడాకారులు పోటీలకు హాజరుకానున్నారు. పోటీల విజయవంతానికి భారజల కర్మాగారం జీఎం హెచ్‌కే.శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 14న పోటీలు ముగియనున్నాయి.

విద్యార్థులు ప్రశాంతంగా చదువుకోవాలి



విద్యార్థులకు వార్షిక పరీక్ష సామగ్రిని అందజేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు మానసికంగా ఆందోళన చెందకుండా ప్రశాంతంగా చదువుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. ఆదివారం కొత్తగూడెంలోని అంబేద్కర్ భవన్‌లో బీసీ సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ విద్యార్థులకు వార్షిక పరీక్షల సామగ్రి అందజేసి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న 40 రోజులు ఎంతో కీలకమని, సబ్జెక్టుల వారీగా రోజు రివిజన్ చేసుకోవాలని చెప్పారు. గతేడాది ప్రశ్నాపత్రాలను విశ్లేషించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇ.ఇందిర, మీరాహుస్సేన్, బీఎస్‌ఎన్.రెడ్డి, మోహన్‌రావు, సైదులు, వెంకటేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి



జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో పర్యాటకులు సందడి చేశారు. మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 760 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా, వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.22,805 ఆదాయం లభించింది. 400 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్‌కు రూ.16,200 లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడో, రేపో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎంపిక !

- బరిలో ఆరుగురు సింగరేణి జీఎంలు

సింగరేణి(కొత్తగూడెం) : సింగరేణిలో ఖాళీగా ఉన్న డైరెక్టర్ (ఆపరేషన్స్) పోస్టుకు ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్ర ఎనర్జీ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, సీఎండీ బలరామ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగనున్నట్లు తెలిసింది. ఈ పోస్టుకు గతంలో మణుగూరు జీఎం దుర్గం రాంచందర్, శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ, మందమర్రి జీఎం దేవేందర్, కార్పొరేట్ జీఎం సాయిబాబ, అడ్రియాల ప్రాజెక్ట్ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు బరిలో ఉండగా, ప్రస్తుతం కార్పొరేట్ కార్యాలయంలోని సేఫ్టీ జీఎం తివారీ పేరు కూడా వినిపిస్తోంది. కాగా వీరందరికీ ఈనెల 8న మెడికల్ చెకప్ కూడా నిర్వహించినట్లు తెలిసింది. కాగా, గతంలో ఆపరేషన్స్ డైరెక్టర్‌గా పని చేసిన ఎన్‌వీకే శ్రీనివాస్‌ను ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే హోల్డ్‌లో పెట్టగా ఆరు నెలలుగా సెలవులో ఉన్నారు. ఇదిలా ఉండగా సంస్థలో మరో కీలకమైన పీఅండ్‌పీ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన అధికారికి ఎక్స్‌టెన్షన్ వస్తుందనే ప్రచారం జోరుగా సాగుతుండగా ఈ పోస్టుకు ప్రస్తుతం ఇంటర్వ్యూ నిర్వహించడం లేదని సమాచారం.

మణుగూరు టు ప్రయాగ్‌రాజ్

సైకిల్‌పై బయలుదేరిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి



ప్రయాగ్‌రాజ్‌కు సైకిల్‌పై బయలుదేరిన కృష్ణ

మణుగూరు టౌన్: మణుగూరుకు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ క్యాషియర్, 63 ఏళ్ల వయసు గల కృష్ణ ఉత్తర ప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ఆదివారం సైకిల్‌పై బయలుదేరారు. 1200 కి.మీ.దూరంలోని ప్రయాగ్‌రాజ్ వరకు ఈ నెల 21న చేరుకుంటానని ఆయన చెప్పారు. ప్రస్తుతం అంతటా కాలుష్య ప్రభావం తీవ్రరూపం దాలుస్తోందని, ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత వాహనాలను సమకూర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి కృష్ణ చేపట్టిన యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు దుస్సా సమ్మయ్య, వలసాల వెంకటరామారావు, గాండ్ల సురేశ్, ఆర్టీసీ కార్మికుడు ఉపేందర్ ఉన్నారు.

ఖమ్మం వాసికి డాక్టరేట్

ఖమ్మంఅర్బన్ : ఖమ్మం నగరానికి చెందిన టి.వి.పుల్లంరాజు సామాజిక సేవా విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. చెన్నైలోని రాజా అన్నామలై మందిరంలో అమెరికా సౌత్ వెస్టన్ యూనివర్సిటీ వారు ఆదివారం నిర్వహించిన స్నాతకోత్సవంలో తమిళనాడు రాష్ట్ర మాజీ మంత్రి హెచ్.వి.హాండే, గ్లోబల్ అచీవర్స్ చైర్మన్ డాక్టర్ ఆర్ సెల్వం, జిల్లా మెజిస్ట్రేట్ హరిదాసు తదితరుల చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఆయన అందించిన ఆధ్యాత్మిక, సామాజిక సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ ప్రదానం చేశారు.



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న జిల్లా ఆదివాసీ కళాకారులు

కుంభమేళాలో ఆదివాసీ నృత్యం

అశ్వాపురం: ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాను పురస్కరించుకుని జిల్లాకు చెందిన ఆదివాసీలు 34 మంది రేలా నృత్య ప్రదర్శన నిర్వహించారు. కళాకారులతో పాటు వనవాసీ క్షేత్ర సంఘటన మంత్రి శివరామకృష్ణ, జిల్లా బాధ్యులు కోరెం రామారావు, గొంది శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు





సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్) అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : నాలుగు రోజులుగా పుష్కర కుంభాభిషేక హోమం పూజలతో పెద్దమ్మతల్లి ఆలయం భక్తజనంతో కిటకిటాలాడుతోంది. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తున్నారు. పుష్కర(షష్ఠాబ్ది) మహాకుంభాభిషేక మహోత్సవంలో భాగంగా ఆదివారం గణపతిపూజ, పుణ్యావాచనం, పంచామృతావంచగవ్య, మూలతంత్రమ హోమము, సామూహిక కుంకుమ పూజ, చండీహోమం, సంబర, అంగహోమాలు, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, హిరణ్యాధివాసం, శయ్యాధివాసం తదితర పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ రజనీకుమారి, భక్తులు పాల్గొన్నారు.

ఆటలకు బేఫికర్

- ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు
- భద్రాద్రి జిల్లాకు రూ.1.7 కోట్లు విడుదల
- ఖమ్మం జిల్లాకు రూ.1.11 కోట్లు కేటాయింపు
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఫండ్ అందించిన ప్రభుత్వం



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు(ఫైల్)

పాల్వంచరూరల్: విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. క్రీడా సామగ్రి కొనుగోలుకు, పాఠశాలల నిర్వహణకు ఇటీవల నిధులు విడుదల చేసింది. 2024–2025 విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, గిరిజన పాఠశాలలకు నిధులు కేటాయించింది. ఈ నిధులతో రోజువారీ కార్యక్రమాల నిర్వహణతోపాటు ఇంటర్‌నెట్, స్టేషనరీ, క్రీడాసామగ్రి కొనుగోలుకు వెసులుబాటు కల్పించింది.

ఉమ్మడి జిల్లాలో 2,116 పాఠశాలలు

ఉమ్మడి జిల్లాలో 2,116 పాఠశాలలకు క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.2.18 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భద్రాద్రి జిల్లాలోని 1,345 పాఠశాలలకు రూ.1.7 కోట్లు కేటాయించింది. ఇందులో1,021 ప్రాథమిక పాఠశాలలకు రూ.51.05 లక్షలు, 167 ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.16.70 లక్షలు, 157 ఉన్నత పాఠశాలలకు రూ.39.25 లక్షలు మంజూరు చేసింది. ఇక ఖమ్మం జిల్లాకు రూ.1.11 కోట్లు కేటాయించింది.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదల చేసింది. 1నుంచి 30 మంది విద్యార్థులుంటే సంవత్సరానికి రూ.10 వేలు, 31నుంచి 100 మంది విద్యార్థులుంటే రూ.25 వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ. 50 వేలు, 251నుంచి 1000 మంది ఉంటే రూ.75 వేలు, వెయ్యి మందికి పైగా విద్యార్థులుంటే రూ.లక్ష వరకు నిధులొస్తాయి. వాటిని ప్రభుత్వం రెండు విడుతల్లో అందించనుంది.

ఏఏ క్రీడాసామగ్రి కొనాలంటే..

మంజూరు చేసిన నిధులతో ఏఏ క్రీడాసామగ్రి కొనుగోలు చేయాలో ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రాథమిక పాఠశాలల్లో రెండు క్రికెట్ బ్యాట్లు, చిన్న సాఫ్ట్‌బాల్, నాలుగు టెన్నిస్ బంతులు, రెండు పుట్‌బాల్స్, ఒక బాస్కెట్‌బాల్, ఆరు స్కిప్పింగ్ రోప్స్, ఒక టెన్నికాయిట్ రింగ్, ఒక ఐరన్ బాక్స్ కొనుగోలు చేయవచ్చు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో షాట్‌పుట్ ఒక్కటి, డిస్కస్ త్రో ఒక్కటి, రెండు స్కిప్పింగ్ రోప్స్ రెండు, ఒక క్రికెట్ బ్యాట్, నాలుగు టెన్నిస్ బంతులు, వాలీబాల్ నెట్, బాల్, ఒక హ్యాండ్ బాల్, రెండు త్రోబాల్స్, ఒక పుట్‌బాల్, ఒక ఐరన్ ట్రంక్ బాక్స్, ఉన్నత పాఠశాల అయితే ఆరు స్కిప్పింగ్ రోప్స్ , నాలుగు షాట్‌పుట్, నాలుగు డిస్కస్ త్రో పరికరాలు, 20 బ్యాడ్మింటన్ బ్యాట్లు, నాలుగు ,క్రికెట్ బ్యాట్లు, 20 టెన్నిస్ బంతులు, రెండు త్రోబాల్స్ , వాలీబాల్ నెట్, రెండు బంతులు, రెండ్ పుట్ బాల్స్, రెండు హ్యాండ్ బాల్స్ కొనుగోలు చేయాలని సూచించింది.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన క్రీడానిధులతో ఏఏ ఆటవస్తువులు కొనుగోలు చేయాలో మార్గదర్శకాలు విడుదల చేశాం. ఆట వస్తువులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మాత్రమే కొనుగోలు చేయాలి. ఆ వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. నిధులు సక్రమంగా వినియోగించుకునేలా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాం. ఉన్నత పాఠశాలల్లో ఎంఈఓలు పర్యవేక్షించనున్నారు. ఆట వస్తువులను వినియోగిస్తూ వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి. కొనుగోళ్లలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం.

–వెంకటేశ్వరాచారి, డీఈఓ

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- కష్టపడే కార్యకర్తలకే ప్రాధాన్యం
- ఎన్నికల్లో క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి సత్తా చాటాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంగా చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అత్యధిక స్థానాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ప్రజామోదం ఉన్న నేతలను ఎన్నుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. తల్లి లాంటి పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టించి పనిచేయాలన్నారు. సొంత పార్టీలో ఉండి ఎదుటి వారికి సహకరిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఖమ్మం నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఆరాచక శక్తులు లేని ప్రగతిశీల పాలనను ఖమ్మం ప్రజలు స్వాగతించారని, అదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ అభివృద్ధి కాముకులను ఎన్నుకోవాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు గౌరవం కల్పించే అవకాశం ఈ ఎన్నికలతో వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని కార్యక్రమాలు చేపడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను ధైర్యంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన తెలంగాణను అభివృద్ధి, సంక్షేమం వైపు మళ్లించిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార, కార్పొరేటర్ కమర్తపు మురళి, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, దీప్లా నాయక్, తాతా రఘురాం, హరిసింగ్, గుత్తా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాన్నపై ప్రేమతో..

- విగ్రహం చేయించిన కుమారులు



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామ, కుల సంఘం నాయకులు

ఇల్లెందురూరల్: రెక్కల కష్టంతో తమను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన తండ్రిపై ప్రేమతో ఆయన రూపం చిరస్థాయిగా తమ ముందుండాలనే ఆకాంక్షతో విగ్రహాన్ని తయారు చేయించారు కుమారులు. ఇల్లెందు మండలం ధర్మారంతండాలో బోడా సేవా వర్ధంతిని పురస్కరించుకుని కుమారులు విగ్రహాన్ని సిద్ధం చేయగా గ్రామ, కుల పెద్దలు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన సెంట్రల్ కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్‌చంద్‌నాయక్, వాంకుడోత్ రమేష్‌నాయక్, నాయకులు జర్పుల రామ్‌చంద్రునాయక్, ధారావత్ సురేష్‌నాయక్, లావుడ్యా వెంకటేష్, భూక్య శ్రీను, బానోత్ రవీందర్, రమేష్, బానోత్ స్వామి, కుమారులు బోడ శ్రీను, బోడ రమేష్, బోడ చందులాల్, బోడ చిన్న, బోడ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఉమ్మడి జిల్లా అథ్లెట్లు

ఖమ్మం స్పోర్ట్స్ : జాతీయ క్రీడోత్సవాల్లో అథ్లెటిక్స్ విభాగంలో 4 × 100 రిలే పరుగులో ఉమ్మడి జిల్లా మహిళా అథ్లెట్లు సత్తా చాటారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎ.మైథిలీ(ఖమ్మం), మాలోతు సింధు(కొత్తగూడెం) తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాలు దక్కించుకున్నారు. 4 × 100 రిలే పరుగు లక్ష్యాన్ని 47.58 సెకన్లలో పూర్తి చేశారు. జాతీయ క్రీడల్లో రాణించిన అథ్లెట్లను డీవైఎస్‌ఓలు టి.సునీల్‌కుమార్ రెడ్డి, ఎం.పరంధామరెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శులు కె.మహిధర్, ఎం.డీ.షఫీక్ అహ్మద్, కోచ్ ఎం.డీ గౌస్ అభినందించారు.



పతకాలు సాధించిన సింధు, మైథిలీ

12న ప్రతిభా పాటవ పరీక్ష

- డీసీఈబీ సెక్రటరీ నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

ఖమ్మంఅర్బన్ : పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 12న పదో తరగతి విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) కార్యదర్శి నారాయణ తెలిపారు. నగరంలోని రోటరీనగర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పరీక్ష కార్యనిర్వాహక మండలి సమావేశం ట్రస్ట్ అధ్యక్షుడు పరిశ పుల్లయ్య ఆధ్వర్యంలో జరగగా, నారాయణ మాట్లాడారు. ఈ పరీక్ష 11వ తేదీనే జరగాల్సి ఉండగా, ఆరోజున ప్రధానోపాధ్యాయులకు ఎన్నికల శిక్షణ కార్యక్రమం ఉన్నందున 12కు వాయిదా వేసినట్లు తెలిపారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు మహంకాళి స్వరాజ్యలక్ష్మి, టి.సుబ్బారావు, పరిశ రామ్మోహనరావు, ఎల్. వెంకట్రామిరెడ్డి, కసపర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేశారు.. ఇవ్వడం మరిచారు



దివ్యాంగురాలు మహ్మద్ నస్రీన్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన మానసిక, శారీరక దివ్యాంగురాలైన మహ్మద్ నస్రీన్‌కు పింఛన్ మంజూరు చేస్తున్నట్లు లేఖ ఇచ్చిన అధికారులు ఖాతాలో నగదు మాత్రం జమ చేయడం లేదు. ఆమెకు 2022 జూలై 7న పింఛన్ మంజూరు చేస్తున్నట్లు కోడ్ కేటాయించడమే కాక పెన్షన్ రూ.4,016 ఇవ్వనున్నట్లు కార్డు జారీ చేశారు. అయితే, రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు ఆమె ఖాతాలో నగదు జమ కాలేదని నస్రీన్ భర్త మహ్మద్ ఖలీల్ వాపోయారు. ఈ విషయమై సత్తుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఆతర్వాత ఖమ్మం డీఆర్‌డీఓ కార్యాలయంలో సంప్రదించగా తమకు అనుమతి రాలేదని చెప్పడంతో మరోమారు కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. 70శాతం వైకల్యంతో మంచానికే పరిమితమైన నస్రీన్‌ను కార్యాలయానికి తీసుకెళ్లే పరిస్థితి లేనందున తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

రెండు బైకులు ఢీ..

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని యాపిల్ సెంటర్‌లో ఆదివారం యూటర్న్ తీసుకుంటున్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ శ్రీను ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వాహనాలు దెబ్బతినడంతోపాటు కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. కానిస్టేబుల్ ఫిర్యాదుపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

'క్యాథ్‌ల్యాబ్'కు బాలారిష్టాలు

తరచూ ఏర్పడుతున్న అంతరాయాలు

- అవసరమైన పరికరాల కొనుగోలుకు నిత్యం నిధుల కొరత
- శాశ్వత వైద్యుడి పోస్టు లేక డిప్యుటేషన్‌తో నెట్టుకొస్తున్న వైనం



ఖమ్మం పెద్దాస్పత్రిలోని క్యాథ్‌ల్యాబ్ యంత్రం

ఖమ్మంవైద్యవిభాగం: గుండె సంబంధిత రోగులకు భరోసా కల్పిస్తూ పెద్దాస్పత్రిలో కార్డియాలజీ విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. క్యాథ్‌ల్యాబ్ మిషన్ సేవలు అందుబాటులోకి రావడంతో ఇక గుండెజబ్బు బాధితులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అంతా అనుకున్నారు. కానీ 2022 సెప్టెంబర్‌లో ఈ సేవలు అందుబాటులోకి రాగా అప్పటి నుంచీ బాలారిష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఒక్కోసారి బాధితులకు గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు లేక సేవలు నిలుస్తున్నాయి. కొనుగోలుకు నిధుల కొరత ఏర్పడుతుండగా తరచూ ఇక్కట్లు తప్పడం లేదు. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇతర ప్రాంతాలతో పోల్చితే జిల్లాలో కొన్నేళ్లుగా గుండె జబ్బులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని క్యాథ్‌ల్యాబ్ ద్వారా ఉమ్మడి జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రులను అనుసంధానించి గుండెజబ్బు బాధితులకు సేవలందిస్తున్నారు. అయితే ఈ సేవలు అందక పేషెంట్లు తరచూ ఇబ్బంది పడుతున్నారు.

కొనుగోలుకు నిధుల కొరత..

పెద్దాస్పత్రిలోని క్యాథ్‌ల్యాబ్ మిషన్ ద్వారా ఇప్పటి వరకు 1,641 మందికి గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించారు. తరచూ ఇబ్బందులు ఏర్పడకుంటే అంతకు రెట్టింపు సేవలు అందేవి. ఎంతో ప్రాముఖ్యత గల మిషన్ అందుబాటులో ఉన్నా తరచూ సేవలకు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా శస్త్ర చికిత్సకు అవసరమైన పరికరాల కొనుగోలుకు నిధుల కొరత వేధిస్తోంది. కార్డియాలజీ విభాగంలో కరోనరీ యాంజియోగ్రామ్ శస్త్ర చికిత్సలతో పాటు, స్టంట్లు, బెలూన్ యాంజియోప్లాస్టీ, రెనల్ యాంజియోగ్రామ్, రూట్ యాంజియోగ్రామ్, కారోటిడ్ యాంజియోగ్రామ్, పెరిపెరల్ యాంజియోగ్రామ్, బ్రాంకియల్ యాంజియోగ్రామ్, పెరీ కార్డియో సెంటెసిస్ వంటి సేవలు అందిస్తున్నారు. అంతరాయం ఏర్పడినప్పుడు మాత్రం సేవలు నిలిచిపోతున్నాయి. దీంతో కొందరు బాధితులు ప్రైవేటు బాట పడుతున్నారు. నిరుపేదలు మాత్రం చేసేది లేక ఇంటికి వెళ్లి ఇబ్బంది పడుతున్నారు. క్యాథ్‌ల్యాబ్ సేవలకు అవసరమైన కాంట్రాస్ట్, స్టంట్స్, బెలూన్, కేథర్స్, వైర్ తదితర వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి పంపించాలి. కానీ ఖమ్మంలో అలా జరగడం లేదు. దీంతో ఈ ఆస్పత్రి నిధులతోనే కొనుగోలు చేయాల్సి వస్తోంది. నిధులు ఉన్నప్పుడు కొనుగోలు చేయడం, లేనప్పుడు చేతులెత్తేయడం ఇక్కడ సర్వసాధారమైంది.

శాశ్వత వైద్యుడు లేకుండానే..

సాధారణంగా గుండె వైద్య నిపుణుడు, ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ అయ్యాకే క్యాథ్‌ల్యాబ్ మిషన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే సిబ్బందితో సంబంధం లేకుండా పెద్దాస్పత్రిలో హడావిడిగా మిషన్ పెట్టారు. డిప్యుటేషన్‌పై ఓ వైద్యుడిని తీసుకొచ్చి సేవలు అందిస్తున్నారు. అలాగే నలుగురు టెక్నీషియన్లు, ఐదుగురు స్టాఫ్‌నర్సులు ఉండాలి. కానీ ప్రస్తుతం నలుగురు టెక్నీషియన్లు ఉన్నా.. స్టాఫ్‌నర్సులు మాత్రం ఇద్దరే విధులు నిర్వహిస్తున్నారు. క్యాథ్‌ల్యాబ్ సేవలు అందుబాటులో ఉన్నాయనే ఆశతో ఇక్కడ నిత్యం 70 మంది గుండెజబ్బు బాధితులు ఓపీ సేవలు పొందుతున్నారు. అలాగే రోజుకు సుమారు 100 మందికి టూడీఇకో సేవలు అందిస్తున్నారు.

ఖమ్మం క్యాథ్‌ల్యాబ్ ద్వారా అందించిన సేవలు

	2022	2023	2024	2025 (ఇప్పటివరకు)
యాంజియోగ్రామ్	321	337	230	19
స్టంట్లు	135	283	239	19
ఇతర సేవలు	32	15	13	-

ఇబ్బందులు ఎదురుకాకుండా..



అప్పుడప్పుడు సేవలకు అంతరాయం ఏర్పడుతున్నా బాధితులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం. పరికరాల కొరత వచ్చినప్పుడు సూపరింటెండెంట్‌తో మాట్లాడి స్థానికంగా కొనుగోలు చేస్తున్నాం. ఇక్కడ ఓపీ సేవలు కూడా పెరిగాయి. నాలుగు జిల్లాల నుంచి గుండె సంబంధిత బాధితులు వస్తుండడంతో సేవలు విస్తృతమయ్యాయి. ఇక్కడికి వచ్చినవారికి పూర్తిస్థాయిలో సేవలందించాకే పంపిస్తున్నాం. ఇబ్బందులు తలెత్తితే వెంటనే పరిష్కరిస్తున్నాం. ఇక ముందు క్యాథ్‌ల్యాబ్ సేవలు మరింత మెరుగుపడతాయి.

– డాక్టర్ సీతారాం, గుండె వైద్య నిపుణులు

మంచి స్నేహం ఉన్నతికి తోడ్పడుతుంది



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: ప్రతీ ఒక్కరి జీవన విధానంపై స్నేహితుల ప్రభావం ఉంటుందని, మంచి స్నేహితులు కలిగి ఉన్న వారే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని చెన్నంగులగడ్డ గ్రామంలో దివంగతుల మిత్రుల జ్ఞాపకార్థం కొమరంభీం యూత్ ఆధ్వర్యాన నిర్వహించిన ఎనిమిది మండలాల కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. పోటీల్లో కూటాన్‌తండా, గురిమెళ్ల, చెరువుకొత్తగూడెం, చెన్నంగులగడ్డ గ్రామాల జట్లు మొదటి నాలుగు స్థానాల్లో నిలవగా.. ఎమ్మెల్యే వారికి జ్ఞాపిక, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చాట్ల భాగ్యమ్మ, మాజీ ఎంపీటీసీ పూనెం లింగమ్మ, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నామ నాయక్, గ్రామ పెద్దలు చాట్ల స్వామి, అలెం సారయ్య, కల్తి భిక్షం, అలెం అంజయ్య, పాయం లక్ష్మీనర్సు, ఊకే రాజేశ్వరి, నిర్వాహకులు ఈసం సతీష్, పాయం అశోక్, ఈసం నీవన్, అలెం పాపారావు తదతరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ పేరుతో నరమేధం

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు..

ఖమ్మం మామిళ్లగూడెం : ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి నేషనల్ పార్క్‌లో ఆదివారం ఎన్‌కౌంటర్ పేరుతో పోలీసులు నరమేధం సృష్టించారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు పోలీసులు చెబుతున్నారని, మృతుల సంఖ్య ఇంకా పెరగొచ్చని అంటున్నారని, అయితే ఇందులో మావోయిస్టులు ఎందరో, అమాయక ఆదివాసీలు ఎందరో అనే వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో విదేశీ శత్రువులపై యుద్ధం ప్రకటించినట్టుగా కేంద్ర ప్రభుత్వం బస్తర్ పైన, మావోయిస్టు ఉద్యమం పైనా విరుచుకుపడుతోందని ఆరోపించారు. 70 వేల మంది బలగాలు, స్పెషల్ ఆపరేషన్ టీమ్‌తో అడవిని జల్లెడ పడుతున్నారని, ఆదివాసీ గ్రామాలను తగలబెడుతున్నారని పేర్కొన్నారు. నక్సలైట్ ఉద్యమాన్ని సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యగా కాకుండా అంతర్గత భద్రతా ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని, ఛత్తీస్‌గఢ్‌లో జరిగే నరమేధంపై నిరసన తెలపకుంటే బీజేపీ, ఫాసిస్టులు ఇక ముందు ప్రజాస్వామికవాదులు, భిన్న సంస్కృతులు, భిన్నాభిప్రాయాలు ఉన్న వారిని సైతం ఇలాగే నిర్మూలిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు



తీవ్రగాయాలపాలైన ఆటో డ్రైవర్ శివశంకర్

పెనుబల్లి: మండలంలోని మండాలపాడు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఇడుపుల శివశంకర్ వీఎంబంజర్ వైపు వస్తూ కారును ఓవర్ టేక్ చేయబోగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఆటో అదుపుతప్పి పల్టీలు కొట్టగా.. ఆటోడ్రైవర్ శివశంకర్ రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో సత్తుపల్లి వైపు నుంచి ఖమ్మ వైపు వెళ్తున్న లారీ టైర్లు శివశంకర్ మోచేతి పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ అప్రమత్తంగా ఉండటంతో ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

జామాయిల్ కర్రలు పట్టివేత



ట్రాక్టర్‌ను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

జూలూరుపాడు: ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలం గంగులనాచారం గ్రామం రాజుపాలెం అటవీ బీట్ ప్లాంటేషన్‌లోని జామాయిల్ చెట్లు నరికి కర్రలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఆదివారం తెల్లవారు జామున అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. జామాయిల్ కర్రలను తరలిస్తున్నారనే సమాచారంతో అటవీ సెక్షన్ ఆఫీసర్ వి.మల్లయ్య, బీట్ ఆఫీసర్లు బి.నరసింహారావు, ఎస్‌కె.రహీంలు ట్రాక్టర్ పట్టుకొని, జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ కార్యాలయానికి తరలించారు. సురారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ట్రాక్టర్‌లో జామాయిల్ కర్రలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్ రావు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.15 వేలు ఉండొచ్చని, ట్రాక్టర్‌ను సీజ్ చేసి, విచారణ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

నాటుసారా సీజ్..



పట్టుబడిన నిందితులతో అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం మీదుగా ఏపీలోని చింతూరు నుంచి సారపాకకు అక్రమంగా తరలిస్తున్న నాటు సారాను ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం ఉదయం సాధారణ తనిఖీలలో భాగంగా కూనవరం రోడ్డులో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో రెండు ద్విచక్ర వాహనాల్లో ఇద్దరు వ్యక్తులు నాటుసారాను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వారిని ఆపి తనిఖీ చేయగా 25 లీటర్ల నాటుసారా లభించింది. ఈ ఘటనలో చింతూరుకు చెందిన మడకం సోమయ్య, ముచ్చిక ఇరమయ్యలపై కేసు నమోదు చేసి వారి వద్ద ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు, ఒక మొబైల్‌ను స్వాధీనం చేసుకుని స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. పట్టుబడిన సారా విలువ రూ.లక్ష ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీలలో ఈఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ బాలు, సుధీర్, విజయ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పందెం రాయుళ్లపై కేసు నమోదు

దమ్మపేట: మండల పరిధిలోని మందలపల్లి గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్న వ్యక్తులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని మందలపల్లి గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచార మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు పరారయ్యారు. వారి వద్ద నుంచి ఒక కోడిపుంజు, మూడు బైకులు, రూ.2,750ల నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చలమన్ననగర్ గ్రామ శివారులో..

ములకలపల్లి: కోడిపందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని చలమన్ననగర్ గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కోడిపుంజులు, ఒక బైక్, రూ.2వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అడవి, వృక్షాలపై అవగాహన



రామయ్యతో విద్యార్థులు, అటవీశాఖ అధికారులు

పెనుబల్లి: మండలంలోని బ్రహ్మళకుంట పులిగుండాల ప్రాజెక్టును ఏన్కూరు గురుకుల పాఠశాల విద్యార్థులు ఆదివారం వనదర్శిని కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య విద్యార్థులకు చెట్ల ఆవశ్యకత, సకల జంతువుల జీవన విధానం, జీవరాశుల ప్రాముఖ్యతను వివరించారు. ఖమ్మం అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస్ చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ జి.ఉమ, డీవైఆర్‌ఓలు సురేశ్‌కుమార్, రాంసింగ్, ఎఫ్‌ఎస్‌ఓ కాలు, ఎఫ్‌బీఓలు లావణ్య, నాగరాజు, సమత, ప్రసాద్, శ్రీను, అజామలి, మస్తాన్ తోపాటు సుమన్, జానీ, రాములు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో ధ్వంసమైన కారు, ట్రాలీ

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. ఖమ్మం నుంచి మేడారంకు కారులో వెళ్తున్న వారు కొమరారం గ్రామంలో రోడ్డు పక్కన నిలిచి ఉన్న ట్రాలీని వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంతో పాటు ట్రాలీ కూడా ధ్వంసంకాగా కారులో ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన ప్రాంతం కూడళి కావడం, కారు వేగంగా వచ్చిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న వ్యక్తులు కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయారు.

బైక్ కొనివ్వలేదని.. యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ద్విచక్ర వాహనం కొనివ్వలేదని ఓ యువకుడు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానిక ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని ఫైర్ కాలనీకు చెందిన చీకటి స్వామి(20) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే తనకు బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులతో గత కొద్ది రోజులుగా గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో స్థానిక అగ్నిమాపక కేంద్రంలో స్వీపరుగా పని చేసే తల్లి వరలక్ష్మి కేంద్రానికి వెళ్లగా.. అదే సమయాన స్వామి తల్లి వద్దకు వెళ్లి ఖర్చులకు డబ్బులు అడుగగా.. ఇంటికి వచ్చాక ఇస్తానని చెప్పడంతో ఆమెతో వాగ్వాదం పెట్టుకున్నాడు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లి మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తల్లి చూసే సరికి ఉరివేసుకొని కనిపించడంతో గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వా రంతా అక్కడకు వచ్చి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దీంతో తండ్రి కొండయ్య చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, దంపతులకు ఒక్కడే సంతానం కావడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

తల్లితో గొడవ తట్టుకోలేక బాలిక..

భద్రాచలంఅర్బన్: తల్లితో గొడవపడి ఓ బాలిక (14) ఆత్మహత్య చేసుకుంది. భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటన వివరాలను పోలీసులు ఇలా తెలిపారు. పట్టణంలోని ఎంపీ కాలనీకి చెందిన 9వ తరగతి చదువుతున్న ఓ బాలిక శనివారం రాత్రి తన తల్లి విజయలక్ష్మితో గత రెండు, మూడు రోజుల నుంచి చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆ బాలిక తట్టుకోలేక ఆదివారం ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతిరాలి తల్లి ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి



కమ్మలమ్మ(ఫైల్)

మణుగూరుటౌన్: రోడ్డు దాటుతుండగా మోటార్‌సైకిల్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం.. తోగ్గూడెం గ్రామానికి చెందిన భూక్య కమలమ్మ(69) శనివారం రాత్రి రోడ్డు దాటుతుండగా, మణుగూరు నుంచి అశ్వాపు రం వైపు వెళ్తున్న ఓ మోటార్ సైకిల్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వృద్ధురాలికి తీవ్రగాయాలు కాగా, సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందు తూ మృతి చెందిందని, మోటార్ సైకిల్ నడిపిన వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మృతురాలి నివాసానికి వెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

మధిర: మధిర రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన కొత్తూరు ప్రదీప్‌కుమార్ (34) వ్యక్తిగత కారణాలతో కిలోమీటర్ నంబర్ 529/16–18 వద్ద దిగువ లైన్‌లో వెళ్తున్న జైపూర్ – చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టాఫీస్‌లో చోరీకి యత్నం



ధ్వంసమైన కంప్యూటర్ మానిటర్, తలుపు

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్‌లో గుర్తు తెలియని ఓ దొంగ చోరీకి యత్నించాడు. టేకులపల్లి ఎస్‌ఐ పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సబ్ పోస్టాఫీస్ తలుపులు ఆదివారం పగలకొట్టి ఉండడంతో ఇంటి యజమాని సబ్ పోస్టు మాస్టర్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆయన వచ్చి ఆఫీస్ లోపల పరిశీలించగా.. లాకర్‌లోని సుమారు రూ.20వేల నగదు ఉన్నప్పటికీ కంప్యూటర్ మానిటర్, బార్ కోడ్ స్కానర్ మాత్రం ధ్వంసమై ఉన్నాయి. విషయం తెలుసుకున్న పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చిన్న యాకయ్య సందర్శించి ఘటనపై ఆరా తీశారు. సబ్ పోస్టు మాస్టర్ ప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు.